## మాజీ మంత్రుల అరెస్ట్ సరికాదు

- బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 13: తాండూరు ఎస్సీ హాస్టల్ సందర్శనకు వెళ్తున్న మాజీ మంత్రులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు గురుకుల బాట పడితే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతున్నదని, వారి లోపాలు ఎక్కడ భయట పడుతాయోనన్న భయంతో నిర్బంధకాండ కొనసాగిస్తున్నదని ఆరోపించారు. తాండూరు ఎస్సీ హాస్టల్ సందర్శకు వెళ్తున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, తదితర నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులను పరామర్శించడానికి వెళ్తున్న వారిని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పాలనలో గురుకులాలు పూర్తిగా నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో శ్రీనివాస్, అనీల్‌గౌడ్, నవీన్‌కుమార్, వెంకటేష్, సామల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

కలెక్టరేట్, డిసెంబర్ 13: జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య కోరారు. జీవో 51 సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత కేటగిరీ కొనసాగించి, జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 17న 'చలో హైదరాబాద్' చేపడుతున్నామని, ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా చేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్యాల నర్సయ్య, అన్నల్‌దాస్ గణేశ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ పేరుతో ప్రభుత్వం అనేక ఇబ్బందులు పెడుతున్నదని ఆరోపించారు. కనీస వేతనం చెల్లించకుండా పీఆర్సీలో చేర్చకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే కనీస వేతనం రూ.26 వేలు ఇస్తామని, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని గతేడాది ఎన్నికల ముందు మాట్లాడిన ప్రస్తుత ఎమ్మెల్యేలు, గద్దెనెక్కాక విస్మరించడం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను ఎన్నిసార్లు నెరవేర్చాలని ఏడాదిగా వినతిపత్రాలు అందించినా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె నోటీస్ ఇచ్చినట్లు చెప్పారు. 17న జిల్లాలోని పంచాయతీ కార్మికులు అందరూ పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, ఇల్లంతకుంట మండలాధ్యక్షుడు మల్లయ్య ఉన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

కోనరావుపేట, డిసెంబర్ 13: వట్టిమల్ల గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గోపు పర్శరాములు శుక్రవారం సన్మానించారు. ఇక్కడ ఎంఈవో మురళినాయక్, ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు, మంగ, నేతలు సుంక భూమయ్య, అంగన్‌వాడీ టీచర్ షీలా, తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్లు నెరవేర్చాల్సిందే

- ప్రభుత్వం స్పందించక పోతే నిరవధిక దీక్ష చేస్తాం
- సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు
- నాలుగో రోజుకు చేరిన దీక్ష



కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న ఎస్ఎస్ అభియాన్ ఒప్పంద ఉద్యోగులు

కలెక్టరేట్, డిసెంబర్ 13: సమగ్ర శిక్ష విభాగంలో విద్యాశాఖలో పని చేస్తున్న తమ సర్వీసులను వెంటనే రెగ్యులరైజ్ చేసి, మినిమం పే స్కేలు అమలు చేయాలని ఒప్పంద ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న దీక్షలు శుక్రవారానికి నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హన్మకొండలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ప్రతి ఉద్యోగికి రూ.పది లక్షల ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఏండ్ల తరబడి వెట్టి చేస్తున్న తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా లేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిపై పునరాలోచించి విరమణ ప్రయోజనాల కింద రూ.25 లక్షలు అందజేయాలని కోరారు. ప్రతి నిత్యం విద్యాశాఖలో తలమునకలై విద్యాభివృద్ధిలో రెగ్యులర్ టీచర్లతో సమానంగా పనిచేస్తున్న తమను గుర్తించకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తాము కుటుంబాలను నడుపుకోవడం ఇబ్బందిగా మారిందని పలువురు మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమ్మెను నీరుగార్చేందుకు ప్రభుత్వం తాత్కాలిక ఉద్యోగులను పంపిస్తూ తమ ఉద్యమంపై నీళ్లు చల్లేందుకు ప్రయత్నిస్తున్నదని, ఇదే విధానం కొనసాగిస్తే తమ డిమాండ్లు నెరవేర్చేదాకా నిరవధిక దీక్ష చేస్తామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శిబిరంలో జిల్లాలోని క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు, కస్తూర్బా ఉద్యోగులు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# 26 కేంద్రాలు.. 7,163 మంది అభ్యర్థులు

- గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం
- అధికారులు.. సిబ్బందికి రెండో విడుత శిక్షణకు ఏర్పాట్లు
- టీజీపీఎస్సీ వెబ్ సైట్‌లో అభ్యర్థుల హాల్ టికెట్లు
- సెంటర్లకు గంట ముందే చేరుకోవాలి: కలెక్టర్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ)/ కలెక్టరేట్: గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు జిల్లాలో సర్వం సిద్ధమైంది. సిరిసిల్ల, వేములవాడలో మొత్తం 26 కేంద్రాలను ఏర్పాటు చేసిన యంత్రాంగం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నేతృత్వంలో విధుల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి రెండో విడత శిక్షణ ఇచ్చేందుకు సమాయత్తం అవుతున్నది. ఇప్పటికే అభ్యర్థుల హాల్ టికెట్లు వెబ్ సైట్‌లో అందుబాటులో పెట్టింది. పరీక్షకు జిల్లా నుంచి మొత్తం 7,163 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, వీరిలో 106 మంది దివ్యాంగులు ఉన్నారు. అలాగే డిపార్ట్మెంటల్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్లు, అబ్జర్వర్లు 26 మంది చొప్పున నియమించారు.

### అభ్యర్థులకు సూచనలు..

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారు. టైం దాటిన తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరినీ అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫొటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డు తీసుకొని రావాలి. హాల్ టికెట్‌పై పాస్‌పోర్ట్ సైజు ఫొటో ముద్రించి తీసుకెళ్లాలి. పరీక్షలన్నింటికీ ఒకే హాల్ టికెట్‌ను వినియోగించాలి. హాల్ టికెట్‌లో ఫొటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్షా హాల్లో ఇన్విజిలేటర్‌కు అప్పగించాలి. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకోవాలి. పరీక్ష కేంద్రాలకు ఎలాంటి జ్యూవెల్లరీ, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువచ్చేందుకు వీల్లేదు. చెప్పులు మాత్రమే వేసుకుని రావాలి. షూస్ వేసుకోవద్దు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్లరాదు.

### గంట ముందే చేరుకోవాలి..



గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు వారికి కేటాయించిన కేంద్రానికి నిర్దేశిత సమయానికంటే గంట ముందే చేరుకోవాలి. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఇప్పటికే సౌకర్యాలు కల్పించాం. అభ్యర్థులు టీజీపీఎస్సీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.

- సందీప్ కుమార్ ఝా, కలెక్టర్

## విజేతలకు బహుమతులు

వేములవాడ రూరల్, డిసెంబర్ 13: మర్రిపల్లి గ్రామంలో జరిగిన క్రికెట్ ప్రీమియం లీగ్ సీజన్ వన్ కార్యక్రమంలో విజేతలకు వేములవాడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి, నాయకులు సంఘ స్వామి, కట్కం మల్లేశం బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఇక్కడ నాయకులు పరమేశ్, తంపుల సుమన్, సురేందర్‌రెడ్డి, మొగిలి దేవరాజ్, పొన్నం మహేశ్, కిరణ్, రాకేష్, రాజు, ఉదయ్ పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 13: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజలి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు జరిపిన స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీసీపీఎన్డీ చట్టం ప్రాధాన్యతను వివరించారు. ఇక్కడ డాక్టర్ నహిమజోహన్, హెచ్ఈ బాలయ్య, తదితరులు ఉన్నారు.


నమస్తే తెలంగాణ
CLASSIFIED

WANTED
jobs Apply Now!
★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All

PLOT FOR SALE
★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189


## బోయినపల్లి కేజీబీవీలో బోధనకు మేల్ టీచర్లు

- లోపలికి అనుమతించని పాఠశాల కమిటీ చైర్‌పర్సన్

బోయినపల్లి, డిసెంబర్ 13: బోయినపల్లి కేజీబీవీ పాఠశాలలో బోధన చేసేందుకు వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బిల్ల కవిత లోపలికి అనుమతించలేదు. వివరాల్లోకి వెళితే.. తమ డిమాండ్ల సాధనకు నాలుగు రోజులుగా సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఆందోళన కార్యక్రమానికి బోయినపల్లి కేజీబీవీ పాఠశాల మహిళ ఉపాధ్యాయినులు వెళ్లారు. అయితే వారి స్థానంలో కేజీబీవీలో హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు బోయినపల్లి పాఠశాల నుంచి ఉపాధ్యాయులను అధికారులు పంపించగా, అప్పటికే అక్కడే ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బిల్ల కవిత వారిని స్కూల్లోకి అనుమతించలేదు. విద్యార్థినులు ఉండే రెసిడెన్షియల్ పాఠశాలలోకి మగ వారికి ప్రవేశం ఉండదని, ఎలా వస్తారని ప్రశ్నించారు. తమను ఇన్‌చార్జి ఎంఈవో శ్రవన్‌కుమార్ పంపించారని టీచర్లు పేర్కొనగా, అనుమతించేది లేని స్పష్టం చేశారు. వారు ఇన్‌చార్జి ఎంఈవోకు ఫోన్ చేన్ చేసి విషయం చెప్పడం, అప్పటికే జర్నలిస్టులు అక్కడికి చేరుకోవడంతో బైక్‌పై తిరిగి వెళ్లి పోయారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఏనుగు మనోహర్ రెడ్డి

కోనరావుపేట, డిసెంబర్ 13: బావుసాయిపేటకు చెందిన పాత్రికేయుడు ఊరడి మల్లికార్జున్ తల్లి అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు అంత్యక్రియల్లో బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాఘవరెడ్డి, చంద్రయ్య గౌడ్, దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ పాషా, నందయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వేములవాడ, సిరిసిల్లలో లోక్ అదాలత్‌లు

గాంధీ చౌక్, డిసెంబర్ 13: సిరిసిల్ల, వేములవాడ కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత కోరారు. జిల్లా కోర్టులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో రాజీ చేసుకోదగిన 600 కేసులను గుర్తించామని, ఇరుపక్షాల సమ్మతితో లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారని తెలిపారు. సమావేశంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్, లోక్ అదాలత్ మెంబర్ చింతోజు భాస్కర్ ఉన్నారు.

## లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ చౌక్, డిసెంబర్ 13: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్ణీత ఆన్‌లైన్ రుసుంతో కూడిన ద్విచక్రవాహన లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. డ్రైవింగ్ వచ్చి 18 ఏండ్లు నిండిన ఆసక్తి గల యువతీ, యువకులు 19వ తేదీ లోగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డుతో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టెస్టులో అర్హత సాధించిన వారికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు తెలిపారు.

## 'కామన్ డైట్'ను పక్కాగా అమలు చేయాలి



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్

కలెక్టరేట్, డిసెంబర్ 13: జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ ఆదేశించారు. కామన్ డైట్ మెనూ అమలుపై ఆయా విద్యాలయాల బాధ్యులు, ఇన్‌చార్జిలతో ఆయన జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 14 నుంచి కామన్ డైట్ మెనూను అమల్లోకి తెస్తామని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని, పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని సూచించారు. హాస్టల్స్‌లో కామన్ డైట్ వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి హాస్టల్‌లో ఒకే రకమైన ఆహారం అందించాలని సూచించారు. కిచెన్, డైనింగ్ ఏరియా నిర్వహణ మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కాగా, శనివారం జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో కామన్ డైట్ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు ప్రారంభిస్తారని, పిల్లలు వారి తల్లిదండ్రులతో పాటు భోజనం చేస్తారని తెలిపారు.

# ఏడు నెలలైనా వేతనాలు ఇవ్వరా..?

- మున్సిపల్ ఆర్పీల నిర్బంధం అన్యాయం
- వేములవాడలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి



వేములవాడ ఠాణా వద్ద ఆర్పీలకు సంఘీభావం తెలుపుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ, డిసెంబర్ 13: ఎన్నికల టైంలో మున్సిపల్ ఆర్పీల వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయకుండా, కనీసం ఉన్న రూ.6వేల వేతనాన్ని కూడా ఏడు నెలలుగా ఇవ్వకపోవడం సరికాదని మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి మండిపడ్డారు. రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు మున్సిపల్ ఆర్పీలు శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టగా, వేములవాడలోని ఆర్పీలను పోలీసులు ఉదయాన్నే అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి ఠాణాకు వెళ్లి వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చకుండా, కనీసం అడిగే వీలు లేకుండా నిరంకుశ పాలనను అమలు చేస్తోందని మండిపడ్డారు. మహిళలని చూడకుండా వేకువ జామునే పోలీస్ స్టేషన్‌ను తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వేములవాడ ఆర్పీల సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ 164 జీవో ప్రకారం శ్రీనిధి వీఎల్ఆర్ నుంచి మాత్రమే తమకు వేతనాలు ఇస్తున్నారని, ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా నెలకు రూ.18వేల వేతనాలు అమలు చేయాలన్నారు. కాగా, ఆర్పీలు భూదేవి, హింగే నీతూ కుమారి, ఉమా, శాంత, జ్యోతి, మహేశ్వరి, పద్మతోపాటు మరో 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీ మీద విడుదల చేశారు. కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్, గోలి మహేశ్, బిఆర్ఎస్ నాయకులు ముద్రకోల వెంకటేశం, వాసాల శ్రీనివాస్, రాజు, మహేందర్ తదితరులు ఉన్నారు.

# పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు

- జిల్లా సెరీకల్చర్ అధికారి జగన్‌రావు
- పలు గ్రామాల్లో సాగుపై క్షేత్ర స్థాయిలో పరిశీలన

ముస్తాబాద్, నవంబర్ 19: పట్టుపురుగుల సాగుతో అధిక లాభాలున్నాయని జిల్లా సెరీకల్చర్ అధికారి జగన్‌రావు పేర్కొన్నారు. మద్దికుంట శివారులో సిల్క్ సమగ్ర పథకం-2 (సీఎస్‌బి) ద్వారా రూ.3.5 లక్షలతో మహిళా రైతు బొమ్మెల్లి అంజిలి చేస్తున్న మల్బరీ సాగును జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి కేఆర్ లతతో కలిసి శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టు సాగు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలు, ప్రోత్సాహం, మార్కెట్ సదుపాయాలను వివరించారు. జిల్లాలో 35 మంది షెడ్డు సాగు, మరికొంత మంది 110 ఎకరాల్లో పట్టు సాగుచేస్తున్నారని తెలిపారు. పట్టు పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక యూనిట్‌కు రూ. 3.5 లక్షల సబ్సిడీతో రుణం అందిస్తున్నదని వివరించారు. రైతులు తమ వ్యవసాయక్షేత్రాల్లో కొంతమేరైనా పట్టుసాగు చేస్తే రైతులకు మరింత అవగాహన వస్తుందని, వరికి బదులు పట్టు సాగు చేయాలని సూచించారు.

## ముదిరాజ్ సంఘం కార్యవర్గం

వేములవాడ రూరల్, డిసెంబర్ 13: వేములవాడ రూరల్ మండలం ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు పేర్కొన్నారు. వట్టెంలలోని పెద్దమ్మ ఆలయం వద్ద జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా నూకలమర్రికి చెందిన పెండ్యాల శంకర్, ఉపాధ్యక్షుడిగా ఉప్పల పెద్దలు, ప్రధాన కార్యదర్శి పండుగ మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా పోగుల మల్లేశం, బసరవేని రమేష్, నెల్ల పోశయ్య, పెండ్యాల తిరుపతి, కొమురయ్య, శ్రీనివాస్, మల్లేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాశ్వత ఆహ్వానితులుగా పిట్టల వెంకటేశ్, బసరవేని రవి, కాసరవేని పుల్లయ్య, తుపాకుల మల్లేశం, యామ తిరుపతి ఎన్నికయ్యారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 13: మహిళలు పలు రకాల స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం మల్లేశం సూచించారు. శుక్రవారం స్త్రీశక్తి భవనంలో ఐకేపీ సీసీలు, సిబ్బందితో సమావేశమై, మాట్లాడారు. మహిళలు కోళ్ల పెంపకం, పూల, పండ్ల తోటలు, పలు రకాల వృత్తి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ మండల సమాఖ్య అధ్యక్షురాలు బైరి జ్యోతి, తదితరులు ఉన్నారు.

## సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు

గంభీరావుపేట, డిసెంబర్ 13: అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరును తీసుకురావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై, మాట్లాడారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, తమ పిల్లలను క్రమం తప్పకుండా కాలేజీకి పంపించాలని సూచించారు. ఇక్కడ అధ్యాపకులు గజానంద్, వెంకన్న, శ్రీనివాస్, లింగం, పాపారావు, కవిత, సంతోష, భాను ప్రకాశ్, రాజు ఉన్నారు.

## సెలవు పై ఈవో వినోద్ రెడ్డి

వేములవాడ, డిసెంబర్ 13: వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఐదు రోజులపాటు సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత అవసరాల నేపథ్యంలో శుక్రవారం నుంచి 17వ తేదీ దాకా సెలవు పై వెళ్లగా, ఈఈ రాజేశ్‌కు ఇన్‌చార్జి ఈవో బాధ్యతలు అప్పగించారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీర్నపల్లి, డిసెంబర్ 13: అడవిపదిరలోని 33/11 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవిపదిర, రంగంపేట, లాల్‌సింగ్‌తండాలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. రైతులు, సెస్ వినియోగదారులు గమనించాలని కోరారు.

## నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

ముస్తాబాద్, డిసెంబర్ 13: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్ఐ గణేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఠాణాలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ, దొంగతనాలు, అల్లర్లకు సంబంధించిన ఘటనల్లో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని, అవి సమాజానికి ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు.

## బీసీ సాధికారత సంఘం కన్వీనర్‌గా నరేందర్

వేములవాడ, డిసెంబర్ 13: బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా పొలాస నరేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు వేములవాడలో నరేందర్‌కు రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షుడు కొండ దేవయ్య శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. నరేందర్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం కృషిచేస్తానని, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దేవయ్య, నియామకానికి సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మారం కుమార్, ఇప్పపూల అజయ్, సంఘాల నాయకులు కొండ కనకయ్య, మైలారం రాము, కూరగాయల కొమురయ్య, ఇల్లందుల వెంకటేశం, సీహెచ్ రామస్వామి గౌడ్, తుపుకారి సత్తయ్య, దువ్వాక గంగాధర్, సాగరం రాజు, ఉయ్యాల భూమయ్య, కనపర్తి సుధాకర్, కుంభం రవీందర్, కత్తురోజు జ్ఞానేశ్వర్, దురిశెట్టి నాగరాజు, కూర రవీందర్, మ్యాన రాజేశ్ తదితరులు ఉన్నారు.

## కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

వేములవాడ, డిసెంబర్ 13: వేములవాడ పట్టణానికి చెందిన వివాహిత సోమినేని మౌనిక (30) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మౌనిక కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నది. నయం కాకపోవడం, నొప్పి మరింత ఎక్కువ కావడంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని టైంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందింది. తండ్రి తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## క్రీడారంగంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, డిసెంబర్ 13: క్రీడారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం నూకలమర్రిలో ఉమ్మడిజిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించగా, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

## రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

చందుర్తి, డిసెంబర్ 13: రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, పూర్తిస్థాయిలో చేస్తామని చెప్పి మోసం చేసిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం ఎదుట రుణమాఫీ కానీ రైతులతో నిరసన వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి నిండా ముంచిందని ధ్వజమెత్తారు. చాలామంది రైతులు రెండు లక్షల రుణమాఫీ అవుతుందని ఆశపడి మిగతా డబ్బులు అప్పు తీసుకువచ్చి బ్యాంకులో జమ చేశారని, తీరా మాఫీ జరుగక అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి రైతులకు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ రైతులు మర్రి రాములు, సిరికొండ మల్లయ్య, రవీందర్ రెడ్డి, సిసింద్రీ, హన్మాండ్లు తదితరులు ఉన్నారు.